క్లుప్తంగా

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి



నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలం కాల్పోల్‌లో డెంగీ జ్వరాలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్ అన్నా రు. డెంగీతో బాధపడుతున్న వారిని ఆదివారం పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి పండ్లు పంపిణీ చేశారు. జ్వర తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని జిల్లా ఆస్పత్రికి తరలించేలా ఎమ్మెల్యే తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అధికారులు ఇక్కడి పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు. రూరల్ కన్వీనర్ పద్మ రెడ్డి, మండల అధ్యక్షుడు శశాంక్, రవి, ప్రమోద్, శ్రీనివాస్ యాదవ్, చిన్నారెడ్డి, కిషన్, కృష్ణ నాయక్, ఓం సింగ్, రమేశ్ నాయక్, నరేందర్ రాథోడ్, శంకర్ రెడ్డి, తిరుపతి, జగన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలతో ఒత్తిడి దూరం



నిజామాబాద్‌అర్బన్: సాంస్కృతిక కార్యక్రమాలతో ఒత్తిడి దూరమవుతుందని, విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని నూతన ఉత్సాహంతో ముందుకు పయనించాలని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం సుగుణ గార్డెన్‌లో ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ స్పైర్ సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలో మూడేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వర్సిటీ ఏబీవీపీ జాయింట్ సెక్రటరీలు సమీర్, అక్షయ్, పృథ్వీ, నాయకులు లెనిన్, రమేశ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



నిజామాబాద్ నాగారం: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న దయానంద యోగా కేంద్రంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశారు. ఆగస్టు 7, 8వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో వీరు పాల్గొననున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యోగరత్న ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బాలశేఖర్, సంగీత, రఘువీర్, గంగాదాస్, భూమాగౌడ్, జ్యోతి, రంజిత్, మంజుల, హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

ఖలీల్‌వాడి: నగరంలోని ఖలీల్‌వాడిలోగల ఓ మెడికల్ షాపు ఏజెన్సీలో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. అలాగే వారి నుంచి రూ.5,300 నగదు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని తదుపరి దర్యాప్తు కోసం ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించామన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	99,400	వెండి(కిలో)	1,19,500
22 క్యారెట్స్	91,760	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	160
	(కిలోకు)	లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	50	గాజరుగడ్డ	30	60
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	50	80
జీరకాయ	30	50	దోసకాయ	10	20
దొండకాయ	10	20	ఆలుగడ్డ	25	50
జీర్నినుకాయ	50	80	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిపువ్వు	30	60
వంకాయ	20	40	బీట్‌రూట్	25	50
పాలకూర	10	20	కరివేపాకు	40	60
మెంతికూర	30	50	చామగడ్డ	30	50
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	50	80
పుదీనా	40	80	గోరుచిక్కుడు	35	60
క్యాప్సికం	40	80			

-సుభాష్‌నగర్

పాలిథిన్ రహిత ఇందూరుగా మారుద్దాం

- నగరంలో విస్తృత ప్రచారం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది
- స్థానికులు, విద్యార్థులకు అవగాహన



గూపన్‌పల్లిలో తడి-పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



చంద్రశేఖర్ కాలనీలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పాలిథిన్‌ను అరికట్టేందుకు బల్దియా అధికారులు, శానిటేషన్ సిబ్బంది కృషి చేస్తున్నారు. నో ప్లాస్టిక్ ప్లీజ్ అంటూ వినూత్న ప్రచారం చేస్తున్నారు. నగరంలోని పలు చోట్ల శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు స్థానికులకు, విద్యార్థులకు ప్లాస్టిక్ వల్ల వచ్చే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నారు. నగరంలోని ముబారక్‌నగర్, మాణిక్‌బండార్, గూపన్‌పల్లి, దాస్‌నగర్, చంద్రశేఖర్‌కాలనీలతోపాటు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శానిటరి ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షాదుల్లా హుస్సేన్ అవగాహన కల్పిస్తున్నారు. పాలిథిన్ కవర్లు వాడకుండా ప్రత్యామ్నాయాలు పాటించాలని వివరిస్తున్నారు. ఇంటిలోని తడి-పొడి చెత్తను వేర్వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచనలు చేస్తున్నారు. విద్యార్థులు, స్థానికులకు పాలిథిన్ కవర్ల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. కూరగాయాలు, మటన్, చికెన్, ఫిష్ వంటి వాటిని పాలిథిన్ బ్యాగుల్లో కాకుండా టిఫిన్ బాక్స్‌లను ఉపయోగించాలన్నారు. క్రమంగా పాలిథిన్‌ను నిషేధించాలని సూచించారు.

అవగాహన కల్పిస్తున్నాం



పాలిథిన్ వాడొద్దని, నో ప్లాస్టిక్ అంటూ స్థానికులకు అవగాహన కల్పించాలని కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో జోన్‌లో చెత్తబండి వెంట తిరుగుతూ చెత్త తీసుకువచ్చే మహిళలకు, స్థానికులతోపాటు పాఠశాల విద్యార్థులకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. ఇందూరును పాలిథిన్ రహిత జోన్‌గా మారుస్తాం.

– షాదుల్లా, శానిటరి ఇన్‌స్పెక్టర్(జోన్4–ఎ)

నేటి చిత్రం



మారుతినగర్ పార్కు ప్రహరీ పక్కన నరికివేసిన చెట్లు

నాటుడెందుకు.. నరుకుడెందుకో..?

నిజామాబాద్ సిటీ: అధికారుల ముందు చూపు లేకపోవడం, మొక్కుబడిగా చేసే పనుల వల్ల ప్రజా ధనం వృథా అవుతోంది. సర్కారు ఆదేశించిందని ఎక్కడ పడితే అక్కడ మొక్కలు నాటడం..అడ్డువస్తున్నాయని వాటిని కొట్టేయడం పరిపాటిగా మారింది. గతంలో హరితహారం కింద విద్యుత్ వైర్లకింద మొక్కలు నాటారు. అవి పొడవుగా పెరగడంతో విద్యుత్ వైర్లకు తాకుతున్నాయనే నెపంతో వాటిని కొట్టేస్తున్నారు. వనమహోత్సవంలో విద్యుత్ వైర్ల కింద, రోడ్డు స్థలంలో మొక్కలు నాటకుండా అధికారులు శ్రద్ధ వహించాలి. ప్రజాధనం కాపాడాలి. – చిటికెల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్, గూపన్‌పల్లి

రహదారులు అధ్వానం

- నగరంలో ప్రమాదకర గుంతలతో వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



రైల్వే కమాన్ ప్రాంతంలో గుంతలు పడ్డ రోడ్డు



కోర్టు చౌరస్తాలో..

నిజామాబాద్‌నాగారం: నగరంలో కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో నీరు చేరుతుండడంతో గమనించని వాహనదారులు వాటిపై ప్రయాణం సాగించడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడం వల్లే రోడ్లు దెబ్బతింటున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. కురిసిన వర్షాలతో నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా వరకు, బోధన్ బస్టాండ్ నుంచి అర్సపల్లి వరకు, పులాంగ్ చౌరస్తా నుంచి వర్నిరోడ్ వరకు, హైదరాబాద్ రోడ్లపై పెద్ద సంఖ్యలో గుంతలు ఏర్పడ్డాయి. గుంతల రహదారులతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

తూతూ మంత్రంగా మరమ్మతులు

రోడ్ల నిర్మాణం చేపట్టడంలో అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే వాదన వినిపిస్తోంది. కాంట్రాక్టర్లు చేపట్టే పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతోనే రోడ్లు ఇలా దెబ్బతిని గుంతలమయంగా మారాయని పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన నేపథ్యంలో నగరంలోని పలు రోడ్లపై ఏర్పడ్డ గుంతలకు నామమాత్రపు మరమ్మతులు చేపట్టారు. దీంతో రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలతో రోడ్లు యథావిధిగా మారాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు నాణ్యతగా మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి

నగరంలోని ప్రధాన రోడ్లపై ఏర్పడ్డ గుంతలతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు ఉన్న ప్రాంతంలో ప్రయాణించినప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– కృష్ణ, వాహనదారుడు

టూ వీలర్ మెకానిక్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



ప్రమాణ స్వీకారం చేస్తున్న అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

డిచ్‌పల్లి: రాష్ట్రంలో ఉన్న టూవీలర్ల మెకానిక్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలంగాణ టూ వీలర్ మెకానిక్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం డిచ్‌పల్లి–ఇందల్వాయి మండల టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిచ్‌పల్లిలో నిర్వహించిన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నాయీ బ్రహ్మణులకు ఇచ్చిన విధంగానే టూవీలర్ మెకానిక్‌లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇవ్వాలన్నారు. డిచ్‌పల్లి–ఇందల్వాయి మండల టూ వీలర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా అమృతాపూర్ గంగాధర్, అధ్యక్షుడిగా ముల్క శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా అజీస్, భాస్కర్, ప్రధాన కార్యదర్శులుగా ఈశ్వర్, గంగాధర్, జాయింట్ సెక్రటరీలుగా మనోజ్‌కుమార్, దాసు, కోశాధికారులుగా చక్రాల భాస్కర్, శ్రీనివాస్, లీగల్ అడ్వయిజర్లుగా రాజేందర్‌రెడ్డి, మాణిక్‌రాజ్, ఆర్గనైజర్లుగా కల్యాణ్, సుమన్, 14 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో అసోసియేసన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కిరణ్, బాన్సువాడ అధ్యక్షుడు రవి, బిచ్కుంద అధ్యక్షుడు అబ్బాస్, నాయకులు వాసుబాబు, ధర్మగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటానికి ముందుంటా



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

నిజామాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేయడానికి తాను ముందుంటానని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. వ్యాస మహర్షి జయంతి పురస్కరించుకుని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువందనం కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాలకు చెందిన ఉపాధ్యాయులను ఆదివారం జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్‌లో ఘనంగా సన్మానించారు. జిల్లాలోని ప్రతి కేజీబీవీ నుంచి ఒక్క ఉపాధ్యాయుడిని ఎంపిక చేసి సన్మానించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు బద్రీనాథ్, కార్యదర్శి కృష్ణవేణి, రాష్ట్ర బాధ్యులు రామకృష్ణ, సుదర్శన్, వరప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ఐక్య వేదిక సమావేశం



సిరికొండ: మండల కేంద్రంలో మాదిగ ఐక్య వేదిక మండల కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో మున్ముందు చేపట్టాల్సిన కార్యచరణపై చర్చించినట్లు మండలాధ్యక్షుడు నక్క రాజేందర్ తెలిపారు. ఉపాధ్యక్షుడు నల్ల బుచ్చన్న, దీపక్, సంద్ర శంకర్, నరేందర్, నక్క రాజేశ్వర్, రావుట్ల రమేశ్, నర్సయ్య, చలపతి, తిలక్, సుభాష్, గణేశ్, రణధీర్, సుమన్, భాస్కర్ పాల్గొన్నారు.

పెయింటింగ్ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



నిజామాబాద్ నాగారం: రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల తరబడి పనిచేస్తున్న పెయింటింగ్ కళాకారులను ఆదుకోవాలని కళాకారులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ పెయింటింగ్ కళాకారుడు బ్రహ్మ పెయింటింగ్ చేస్తూ ప్రమాదానికి గురి కావడంతో తోటి కళాకారులు నిత్యావసర సరుకులు, కొంత నగదును ఆదివారం అందజేశారు. అలాగే వయోభారంతో బాధపడుతున్న మరో పెయింటర్ ప్రకాశ్‌కు ఆర్థికసాయం అందజేశారు. మరో సీనియర్ పెయింటర్ అనంతకృష్ణ మృతి చెందడంతో సంతాప సభ నిర్వహించారు. ఆర్టిస్టులు కిషన్, మహదేవన్, చారి, లింబూరి లక్ష్మణ్, వేణు, సాయిబాబా, శ్రీను, శెట్టి, చందు, గంగాధర్, హన్మాండ్లు, రాజు, బలవీర్, గణేశ్, రాజ్ కుమార్, దేవ, రవి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతీక తీజ్



ఇందల్వాయి మండలం మెగ్యానాయక్‌తండాలో..

నిజామాబాద్ రూరల్/ సిరికొండ/ ఇందల్వాయి/ జక్రాన్‌పల్లి: సంప్రదాయాలకు ప్రతీక తీజ్ అని బంజారా నాయకులు అన్నారు. నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో, తండాల్లో తీజ్ వేడుకలను బంజారాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్, రామారావు మహరాజ్ చిత్రపటాలకు పూజలు చేశారు. బోగ్ బండార్ చేపట్టారు. సిరికొండ మండలంలోని సర్పల్లి తండాలో తీజ్ వేడుకలు నిర్వహించారు. గోధుమ మొలకలకు సంప్రదాయ రీతిలో పూజలు చేశారు. ఇందల్వాయి మండలంలోని మెగ్యా నాయక్ తండా, స్టేషన్ తండా, వెంగల్‌పహడ్, పాటి తండాలో, జక్రాన్‌పల్లి మండలంలోని నల్లగుట్ట తండాలో గిరిజనులు తీజ్ వేడుకలు సేవాలాల్ ఆలయంలో పూజలు చేశారు.



పాత కలెక్టరేట్ మైదానంలో పూజలు చేస్తున్న బంజారా నాయకులు



జక్రాన్‌పల్లి మండలం నల్లగుట్ట తండాలో..

వెక్కిరిస్తున్న ఖాళీలు

- మోపాల్ తహసీల్‌లో కీలక పోస్టులు ఖాళీ
- సెలవులో వెళ్లిన తహసీల్దార్
- డిప్యూటీ తహసీల్దార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు
- డిప్యుటేషన్‌పై సీనియర్ అసిస్టెంట్



మోపాల్ తహసీల్ కార్యాలయం

మోపాల్: మండలంలోని తహసీల్ కార్యాలయంలో కీలక పోస్టులు ఖాళీలతో వెక్కిరిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బదిలీపై సిద్దిపేట్ జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్ రామేశ్వర్ నెల రోజుల పాటు సెలవు పెట్టారు. డిప్యూటీ తహసీల్దార్ సరితకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే సీనియర్ అసిస్టెంట్ సోహెల్ అదనపు కలెక్టర్(రెవెన్యూ)కు సీసీగా డిప్యుటేషన్‌లో ఉన్నారు. కార్యాలయంలో రెగ్యులర్ కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడంతో జూనియర్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగులపై భారం పడుతోంది.

కీలక పోస్టుల్లో.. కీలక సమయంలో..

తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్, డీటీ, ఎంఆర్ఐ, ఏఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, రెగ్యులర్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు కీలకంగా ఉంటాయి. మండలంలో తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తద్వారా ఉన్న ఉద్యోగులపై పనిభారం పడుతోంది.

ప్రభుత్వం భూభారతి దరఖాస్తులు స్వీకరించి భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్న తరుణంలో స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో కీలకమైన తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డీటీకి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించడంతో పాలనాపరమైన అంశాలతోపాటు సర్టిఫికెట్ల జారీ, రిజిస్ట్రేషన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ విచారణ, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పర్యటనల సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అన్ని పనులు మానుకుని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల వెంట వెళ్లాల్సి వస్తుండటంతో ప్రజలు అసంతృప్తికి లోనవుతున్నారు.

రెగ్యులర్ తహసీల్దార్ వచ్చేనా..?

స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల వేళ, భూభారతి దరఖాస్తుల పరిశీలన సమయంలో రెగ్యులర్ తహసీల్దార్‌ను కేటాయించాలని మండల ప్రజలు కోరుతున్నారు. సెలవులో వెళ్లిన తహసీల్దార్ రామేశ్వర్ అక్టోబర్‌లో రిటైర్మెంట్ కానున్నారు. మోపాల్ మండలం 2016లో కొత్తగా ఏర్పడిన నాటి నుంచి రెగ్యులర్ తహసీల్దార్లు విధులు నిర్వర్తించారు. కానీ ఈ కీలక సమయంలో ఇన్‌చార్జికి బాధ్యతలు అప్పగించడంతో పని భారం పెరిగింది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు మోపాల్‌కు రెగ్యులర్ తహసీల్దార్‌ను కేటాయించాలని అటు మండల ప్రజలు.. ఇటు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది కోరుతున్నారు. కాగా రెగ్యులర్ తహసీల్దార్‌ను కేటాయిస్తారా అనే విషయమై ఇన్‌చార్జి తహసీల్దార్ సరిత వివరణ కోరగా.. తనకెలాంటి సమాచారం లేదని, ప్రస్తుతానికి తాను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగుతున్నానని తెలిపారు.

సంక్షిప్తం

పసుపు బోర్డు చైర్మన్‌కు సన్మానం



నిజామాబాద్ రూరల్: జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు గంగులయ్య, కేపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు పాటుకూరి తిరుపతిరెడ్డి ఆదివారం అంకాపూర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. పల్లె గంగారెడ్డికి గణపతి విగ్రహాన్ని బహూకరించారు. అలాగే జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్‌లో జేఎం కేపీఎం పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులతో, రైతులతో పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు, రైతులు ఉన్నారు.

వైభవంగా లక్ష్మీ సుదర్శన మహాయాగం

నిజామాబాద్ రూరల్: నగరంలోని ఆర్యనగర్‌లో ఉన్న అభయ ఆంజనేయ వీర హనుమాన్ కమ్యూనిటీ హాల్‌లో వేద విద్యానంద స్వామితో శ్రీ రుద్ర సహిత లక్ష్మీ సుదర్శన మహాయాగం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. సమస్త ప్రాణుల సంక్షేమం కోసం ఈ యాగం నిర్వహించినట్లు పేర్కొన్నారు. గోపూజ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, నవగ్రహ, నక్షత్ర, శ్రీ రుద్ర సహిత లక్ష్మీ సుదర్శన యాగం, జయాది హోమం, పూర్ణాహుతి, పలు కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వారాహి ఆలయంలో ప్రత్యేక పూజలు

నిజామాబాద్ రూరల్: నగరంలోని అమ్మ వెంచర్‌లో ఉన్న వారాహి మాత ఆలయం శ్రావణమాసం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట నుంచి సుమారు 40 మంది భక్తులు ప్రత్యేకంగా ఆలయానికి వచ్చి దర్శనం చేసుకున్నారు. ఆలయ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ భక్తులకు ఆలయ విశిష్టత గురించి వివరించారు. సభ్యులు కె సురేశ్, రమణ, రమేశ్, టి.కృష్ణమోహన్, కె శ్రీనివాస్, ఆర్ శ్రీనివాస్, బి లక్ష్మణ్, కె.ప్రసన్న, రోజా మురళి, రవీందర్, కె.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా గాయత్రి యజ్ఞం

నిజామాబాద్ రూరల్: విశ్వగాయత్రి యజ్ఞ సమితి ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా ఇంటింటా గాయత్రి యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వర్ తెలిపారు. నగరంలోని సాయికృపనగర్‌లో కృష్ణవేణి వంశీ గృహంలో యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వగాయత్రి యజ్ఞ సమితి ఇందూరు వ్యవస్థాపక అధ్యక్షుడు బైస లక్ష్మీనర్సయ్య, సభ్యురాలు సులోచన తదితరులు పాల్గొన్నారు.